# మృతక దినం

శ్రీ సన్నాకుల సుందరరావు

"డాక్టర్!" అంది, గాభరాగా నర్స్ కాంతం.

డాక్టర్ సుధాకర్ ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆ నాల్గవవార్డులో పేషంట్‌కు సీరియస్‌గా యుంది. పిచ్చిపిచ్చి చూపులు! కలవరింతలు! చాలా యిదిగా వున్నయ్" అంటూ తన బాధనంతను వ్యక్తంచేసింది. నర్స్ సూచనల వెనుక విషాదం–ఆత్రుత రెండూ స్పష్టంగా కన్పిస్తున్నయ్.

"యస్! వస్తున్నాపద నర్స్" అంటూ సుధాకర్ నర్స్‌ను అనుసరించి నాల్గవవార్డ చేరాడు.

డాక్టరు జాలిగా ఆ రోగివైపు చూశాడు. "డాక్టర్!" ఆశగా అన్నాడు అతడు. అతని ఆ మాటల్లో విషాదానంద భావాలు రెండూ మిళిత మౌతున్నయ్.

సుధాకర్ అతని చేతిని నెమ్మదిగా అందుకుని నాడి పరీక్షించాడు. ఒక రెండు మూడు గంటల్లో గతించిపోయే అతని జీవితానికి ... డాక్టర్ ఎంతో సానుభూతి చూపాడు.

"డాక్టర్! ... నాకీ ప్రపంచంమీద ఏలాంటి ఉత్సాహము లేదు. ఈ ప్రాణంమీద తీపికూడా లేదు. కాని ఒక్కటే ఒక్క కోర్కె మాత్రం నా జీవితాధ్యాయంలో మిగిలిపోయింది. ఒక్కసారి ... నా జీవిత గాథల్ని ఎవరితోనైనా వినిపించి సానుభూతి పొందాలనుకుంటాను. కాని ... నాపై సానుభూతి చూపేదెవరు డాక్టర్!" ఆయాసం మిళితమౌతూ అతడు మిగతా వాక్యాల్ని చెప్పలేక పోయాడు.

"భగవంతుడు కరుణగలవాడు సుమా! చేతనైనంతవరకు నేను నీకు సహాయంచేస్తాను. భయపడకు" అంటూ అతని భుజాన్ని సానుభూతిగా తట్టాడు డాక్టర్.

డాక్టర్ యొక్క ... ఆ స్పర్శలో రోగి అలసటను తగ్గించుకొని దీర్ఘమైన ఒక నిట్టూర్పు విడచాడు. ట్యూబ్‌లైట్ల కాంతిలో; మానవత్వంతో ప్రకాశిస్తున్న డాక్టర్, నర్స్‌ల వంక అతడు తృప్తిగా చూశాడు. నర్స్ అతనిని జాలిగా పరికించి చూస్తూ తలకు కట్టిన కట్టును ... నెమ్మదిగా పరిశీలించింది.

"డాక్టర్ బాబూ! ... ఒకనాడు నా జీవితం నిత్యకళ్యాణం పచ్చతోరణంగా గడచిపోయేది. శ్రామిక జీవితంలో వచ్చే సుఖానుభూతుల్ని తృప్తిగా అనుభవిస్తూ ధనిక జీవులకు మేము ... దాస్యము చేస్తాము. ఆ దాస్యంలో నేను వారికి ఆనందం చేకూర్చటమేగాక వారియొక్క ఆదరింపులలో నా జీవితాన్ని మిడింపజేసికొని కష్టాల్ని చక్కగా ఆహ్వానించటం నా నిత్య కృత్యం.

ఉదయాన్నే నేనూ, లచ్చి 'విడి – విడి' పనుల్లోకి వెళ్ళి మా విధ్యుక్త ధర్మాల్ని నిర్వర్తించుకొని వచ్చేవాళ్ళం. సాయంత్రానికి మా బడలిక అంతా తీరి ... ఆశ్రమ జీవితంలోనే ఆనందంగా కాలం వెళ్ళబుచ్చేవాళ్ళం.

డాక్టర్! ... అందానికి – ఆనందానికి సన్నిహితం ప్రపంచంలో నుండటం ప్రకృతి సహజం. అందమైన జీవనానికి అలవాటుపడి దాన్ని పొందలేకపోవటం మానవ సహజం. అందానికి దూరంగా యుంటూ గడిపేజీవి ఏనాడూ ప్రపంచంలో లేదు. పొందని వస్తువుకోసం ప్రాకులాడటం మానవనైజం.

మా లచ్చి చాలా రూపసి. ఆ రూపంలోనే "పవిత్రా పవిత్రతలు" మనం కనుగోవటం చాలా కష్టం. కాని లచ్చి నన్ను గాఢంగా ప్రేమిస్తుంది. నేను నా భార్యకు దాసుణ్ణి. పండంటి కాపురం ఒకనాడు కారణంలేకుండానే విషమ పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఉన్నట్టుండి ఒకనాడు లచ్చి మంచానపడింది. అదే — ఆమె యొక్క అంతిమకారణంకూడా. జ్వరంతో బాధపడే భార్యకు మందులిప్పించే శక్తి నాకు లేకపోయింది. ఆమెకు అవసానదశ వచ్చింది. ఇన్నాళ్ళ కాపురంలోనూ ... నేను — లచ్చి ఆనందమయంగా సంసారపక్షంలో గడిపిన దినాలు బహు కొద్ది. ఆమె మంచానపడేసరికి నా హృదయం కొట్టుకులాడింది. నాకు సాటిగా నాతోపాటు కష్టాలను అనుభవించే ఆ ఒక్కజీవి నాకు దూరమౌతున్నట్లు నాకు తోచింది. నా భార్య నాకు కావాలి. ఈ శ్రమ జీవితంనుంచి నేను ఆనందాన్ని పోగొట్టుకో కూడదు అని తలచాను.

నా లచ్చిని బ్రతికించుకోవాలని నేను ఎన్నో ప్రయత్నాలుచేశాను. ఎంతో మందిని డబ్బుకోసం యాచించాను. కాని ఏమహాత్ముడి హృదయమూ ద్రవించలేదు.

ఆకాశం అంతా కారు మేఘాలతో నిండింది. ఒక వైపు వర్షం జోరుగా కురుస్తూయుంది. మరియొకవైపు లచ్చి అవసానదశలో కారుస్తూయున్న కన్నీరు ఆ గాఢాంధకారంలో మిలమిలా మెరిసినయ్.

“మామా ?” అంది బాధగా లచ్చి.

“రేపు ... నీ పుటకదినంకదూ ! ... నీవా రెండంచుల పంచ కట్టుకొని ఎఱ్ఱని కండువా వేసికుంటే ఎంత బాగుంటావు” అంటూ విచారంగా ఆమె నా వైపు చూసింది.

“ఔను లచ్చీ ! ... ఆ పుటకదినానికి అంతే లేదు. మనబోటోళ్లు పుట్టినా నవ్వే జీవిలేదు. అధోగతిపాలై మరణించినా ఒక కన్నీటి చుక్క విడిచేవారులేరు” అన్నాను మౌనంగా దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ.

“దుఃఖించకుమామా ? అందంగావుండే ఏవస్తువునూ ప్రకృతి జీవించనీయదు; హరింపజేయటమే ప్రకృతి సహజం. మానవుడికి అందచందాలు ప్రధానంకావు మావా ? ... నా వంటి అంబాల రాణి దొరకదనే నీవుద్దేశ్యమా ? ఒక్కసారి ఆ రెండంచుల పంచెకట్టుకుని నన్నానందింప జేయవా మామా ?” అంటూ, ఆమె, ఆశగా నావైపు చూసింది.

డాక్టర్ ! ... అది మా పెళ్లినాటి పంచ. దుఃఖంలోకూడా దాన్నిధరించి నాలచ్చి సమక్షంలో దుఃఖమోముతో నిలిచాను. అంతే డాక్టర్ ! ఆ ఒక్క చూపునూ నా హృదయంలో నిలిపి నాలచ్చి గతించింది.

ఆ నిశిరాత్రిలో నా పుటకదినానికి లచ్చిచావే సాక్ష్యమైంది-అదే దినం నా ఆనందానికీ విషాదానికీ నెలవైంది. నాలచ్చి ఆశ్మశానవాటికలో, చితిపై వెలుగుతూయున్న ఆమె దేహం, నాకేదో ప్రబోధాన్ని యిచ్చింది. “మామా ! ఆ పంచెధరించవూ ? నీ పుటక దినంకదూ ?” అనేమాటలు నాకు ప్రస్ఫుటంగా వినిపించినయ్.

లచ్చి లేని జీవితం నాకు అంధకారమయమయి పోయింది. మరునాడు యథాప్రకారం నాపనిలోకి పోయాను. ఒకదినం పనికిరాక పోయినందుకు మాయజమాని నిర్దాక్షిణ్యంగా నన్ను పనిలోంచి తొలగించారు. వారికి నా భార్య చావుతో పని ఏమిటి ? ... బీదల అభాగ్యగాథలతో పనియేమిటి ? ... వారిక్కావలసిందల్లా సుఖభోగాలు.

డాక్టర్ ! ... ఇదిగో ఈ వీధిలోనే నేను పుల్లలు మోస్తూ జీవిస్తూయున్నాను. ఆమోతలోనే నాలచ్చి యొక్క ఆఖరి మాటలు నాలో ప్రతిధ్వనింపసాగాయి. “పుటుకదినం డాక్టర్ ! పుటకదినం ! !” ఒక అభాగ్యగతుడి పుటక దినానికి విలువేముంది. ఒక మహానాయకుడు పుట్టినా, చనిపోయినా అందరూ ఆనందిస్తారు. శుభాశీస్సులనందిస్తారు. వేనోళ్ళ పండుగలుచేస్తారు. ప్రేగులు మాడుతూ ఆకలి బాధతో అలమటించి పోయే మాలాటి వానికి విలువఏముంది!

డాక్టర్ ! ...సంవత్సరం దొరలిపోయింది. మరలా నా “పుటకదినం” వచ్చింది.

నాలచ్చియొక్క ఆత్మశాంతికై నేను ఆ రెండంచుల పంచెను ధరించాలి కాని, ఆపంచె ఎక్కడుంది డాక్టర్! నాకు సేవజేసినంతవరకూ చేసి, చిరిగిపోయింది. దాంట్లో నూతనానందం లేనే లేదు. కనపడిన ప్రతివారినీ యాచించాను. ఒక్కపంచె ఒక్కటే ఒక్కపంచె కోసం కాని ఏ హృదయమూ నాపైకరుణ చూపలేక పోయింది.

నాకప్పట్లో కన్పించిందల్లా! ఒక్కటే మార్గం. అది ... ఆ బట్టల కొట్టులో జొరబడి ఎర్రనికండువా రెండంచుల పంచె దొంగలించాలని. మధ్యరాత్రి-తెల్లవారితే "నా పుటకదినం" నేను ఆదినం ... లచ్చియొక్క ఆత్మశాంతి కలిగించాలి. అది నా ధర్మం. చెక్కలు తొలగించి పంచె కండువాలతో తిరిగి వచ్చేసమయం డాక్టర్! దానికి ప్రతిఫలం, ఘూర్ఖా నన్ను వెనుకనుంచి బలంగా తన లాటితో మోదటమేం. కాకే నెత్తురుతో అలాగే పరిగెత్తుతూ సందులు - గొందులు దాటి ఈ ఆస్పత్రిముందర పడిపోయాను. మీరునన్ను లోనికి తెప్పించారు.

"డాక్టర్! రేపే నా పుటకదినం... ఆపంచె ఎర్రనికండువా నాకు బాగున్నయేకదూ?"

"డాక్టర్! ఒక్కటే ఒక్క కోరిక. ఆకోరికను తీర్చగలరూ ఆ ఒక్క కోర్కెతో, ఈ వెంకడి జీవితం ధన్యత చెందుతుంది" అంటూ డాక్టర్ వైపు చూశాడు.

డాక్టర్ బాధగా అతనివైపుచూచాడు.

"ఒక్కసారి మీటోపీని ఈ తలమీద పెట్టు డాక్టర్! ... నేను అందంగావుంటానా? ...లచ్చి నన్ను మెచ్చుకుంటుందా?" ప్రశ్నించాడు వెంకడు.

డాక్టర్ తన హేట్ తీసి అతనితలమీద పెట్టాడు.

"నర్స్!..." మిగతా మాటల్ని అనలేక తృప్తిగా చూచాడు వెంకడు"

"ఔను! నీ పుటకదినం! ఎంతబాగున్నావ్?" అంది నర్స్ శాంతం. "ఔను! ... అదిగో నాలచ్చికూడా నవ్వుతూయుంది. "నాపుటకదినంకదూ?" వస్తున్నా లచ్చీ!" అంటూ కళ్లుమూశాడు వెంకడు.

"డాక్టర్" అంది నర్స్ భయంగా కళ్లుమూసికుంటూ "భయపడకు నర్స్! ఈ వెంకడి ఆత్మ హాయిగా విహరించకమానదు. ధనవంతులకు వేలమీద సంతోషోత్సాహాల్లాలతో జన్మదినం జరిగినా ఈ ఒక్క పంచె - కండువాతో, ఆనందించిన, ఆనందం మనం, పొందలేం" అన్నాడు డాక్టర్ నర్స్ వైపు చూస్తూ.

కిటికీగుండా వచ్చిన మెఱుపు కాంతి, వెంకడి మొహంమీ దపడింది. ఆ వెలుతురులో అతనిముఖం, కళగా మెరిసింది. అదే కాబోలు గొప్పవిశేషం. వెంకడి పుటకదినానికి మెఱుపు మెరిసింది. అదే! అభాగ్యులకు ప్రకృతి కానుక కూడా. అతనికి చనిపోయినా పుట్టినా మనలా రిస్టువాచీలూ - ఉలెన్ సూట్‌లూ లభించక పోయినా... అంతంలేని ఆనందం లభిస్తుంది "పుట్టినరోజు" వచ్చినపుడు. ఆయుర్దాయంసాగాలని ప్రతివారూ వాంఛిస్తారుగాని ... ఆ పుటకదినం ఏనాడో ఒకనాడు అంతరించక మానదు. బీదవాడు 'పుటకదినం' వచ్చేసరికి తన కష్టాలనుంచి ఏనాడు విముక్తి చెందుతానా అనే ఆలోచిస్తాడు. అదే గొప్పవాడైతే 'ఆయుర్దాయం అధికమై నాలుగురాళ్లు సంపాదించాలనే' ఆలోచిస్తాడు. ఇదే బీదవాడి పుటుకదినానికీ - గొప్పవాడి పుటుకదినానికీ గల తారతమ్యం.

— ౦ —